క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్‌ను ఆటో ఢీకొనడంతో ఐదుగురు గాయపడిన ఘటన మండలంలోని తిక్కవరప్పాడు వద్ద ఆదివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు.. అనికేపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు పని నిమిత్తం ఆటోలో సర్వేపల్లికి బయలుదేరారు. తిక్కవరప్పాడు సమీపంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద ఎదురుగా వచ్చిన బైక్‌ను ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న నార్తురాజుపాళేనికి చెందిన హనుక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఆటో బోల్తా పడగా అందులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గాయపడిన ఇద్దరి మృతి

ఇందుకూరుపేట : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న చిట్టేడు గ్రామానికి చెందిన రాజేష్(24), ఆవుల శ్యామ్ వెంకట్(24) మృతిచెందినట్లు ఎస్సై తిరుపతి సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఈనెల 7వ తేదీన ఆవుల శ్యామ్ వెంకట్, ఆవుల దినేష్, రాజేష్ ముగ్గురు కలిసి తోటపల్లి గూడూరు మండలంలోని ముంగళదొరువుకు వెళ్లి తిరిగి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో కొత్తూరు చింతోపు వద్ద లారీ ఢీకొట్టడంతో రాజేష్, శ్యామ్ వెంకట్‌లకు తీవ్రగాయాలు కాగా, దినేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించగా ఆదివారం రాత్రి శ్యామ్ వెంకట్ మృతిచెందగా, సోమవారం రాజేష్ మృతిచెందినట్లు ఎస్సై వివరించారు. దినేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు.

డయల్ యువర్ డీఎం-1 రేపు

నెల్లూరు సిటీ : నెల్లూరు ఆర్టీసీ డిపో-1 పరిధిలో ప్రయాణికుల సమస్యలు, సూచనలకు సంబంధించి ఈనెల 11వ తేదీన (రేపు) సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య డయల్ యువర్ డీఎం-1 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 99592 25641 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

అపరాల సాగుకు అనుకూలం

- అడపాదడపా కురుస్తున్న వర్షాలు
- కొన్నేళ్ల క్రితం తగ్గిన సాగు
- రబీ సీజన్ అనుకూలమంటున్న వ్యవసాయ శాఖ
- దిగుబడి పెరుగుతుందని ఆశాభావం


మినుము పంట (ఫైల్)

పొదలకూరు: అడపాదడపా వర్షాలు కురుస్తుండడం.. జిల్లాలోని ప్రాజెక్ట్‌ల్లోకి నీరు చేరుతున్న తరుణంలో రబీ సీజన్ అపరాల సాగుకు అనుకూలంగా ఉందని వ్యవసాయాధికారులు వెల్లడిస్తున్నారు. మినుము, పెసర, పచ్చిశనగ పైర్ల సాగు చేపడితే దిగుబడి పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. చాలామంది రైతులు వర్షాలు సకాలంలో కురవడం లేదని పప్పుధాన్యాల సాగుపై మక్కువ చూపడం లేదు. అయితే గతేడాదితో పాటు, ఈ సంవత్సరం కూడా మెట్టపంటల సాగుకు వాతావరణం కాస్త అనుకూలంగానే ఉంది.

తగ్గుతూ వచ్చి..

పొదలకూరు చుట్టుపక్కల ప్రాంతంలో అపరాల సాగు రెండు సంవత్సరాల క్రితం వరకు వరుస నష్టాలు చవిచూడడంతో మెట్ట రైతులు మినుము, పెసర పంటలు వేశారు. 10 వేల ఎకరాల్లో అపరాల సాగు పడాల్సి ఉండగా అధికారిక లెక్కల ప్రకారం గతేడాది వెయ్యి ఎకరాల్లోనే జరిగింది. పదేళ్లుగా చూసుకుంటే మినుము పెద్ద ఎత్తున సాగయ్యేది. పెట్టుబడులు, చీడపీడలు, గిట్టుబాటు ధరల్లేక, వర్షాభావ పరిస్థితుల వల్ల క్రమంగా దాని విస్తీర్ణం తగ్గిపోతూ వచ్చింది. ఒక దశలో కేవలం 500 ఎకరాల్లో కూడా సాగు లేని పరిస్థితి నెలకొంది. అయితే ఈ ఏడాది కొంత వరకు అపరాల సాగు పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 2 వేల హెక్టార్లలో మెట్ట పంటలను చేపట్టే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ముందుగానే సోమశిల, కండలేరు ప్రాజెక్ట్‌లకు వరద నీరు వచ్చి చేరితే రైతులు మినుము సాగును తగ్గించుకునే అవకాశం కూడా లేకపోలేదు.

నీరు చేరితే..

ప్రాజెక్ట్‌ల్లో ముందుగా నీటి నిల్వలు వచ్చి చేరితే అపరాల సాగు ఈ ప్రాంతంలో తగ్గే అవకాశం ఉంటుంది. రబీ సీజన్‌లో మెట్ట పొలాలకు సైతం కాలువల ద్వారా నీరందుతున్న నేపథ్యంలో వరినాట్లు వేసే ఆలోచనలో చాలామంది రైతులున్నారు. పప్పుధాన్యాల సాగు రైతులకు ఆశించిన స్థాయిలో అనుకూలించడం లేదు. అతివృష్టి, అనావృష్టి తదితర కారణాలతో వరుస నష్టాలను చవిచూస్తున్న నేపథ్యంలో మెట్టపంటల సాగుకు రైతులు మొగ్గు చూపలేకపోతున్నారు.

వరి సాగుకే మొగ్గు



మెట్టప్రాంతాల్లో గతంతో పోల్చిచూస్తే పప్పుధాన్యాల సాగు తగ్గుముఖం పడుతోంది. అతివృష్టి, అనావృష్టితో అపరాల సాగు కలిసి రాకపోవడంతో రైతులు సాగుకు ఆసక్తి చూపడం లేదు. నీటి లభ్యత బాగుంటే వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు.

– పెంచల నారాయణరెడ్డి, రైతు, అంకుపల్లి

ప్రోత్సహిస్తున్నాం



మెట్ట ప్రాంతంలో అపరాల సాగును ప్రోత్సహిస్తున్నాం. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి మినుము, పెసర, కంది సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. కందిని అంతరపంటగా సాగు చేస్తే కలిగే ప్రయోజనాలను కూడా వివరిస్తున్నాం. అయితే రైతులు వరిసాగుపై ఆసక్తి చూపుతున్నారు.

– ఎ.వాసు, ఏఓ, పొదలకూరు

హామీలు నెరవేర్చాలంటూ ధర్నా


మనుబోలు : ఆందోళన చేస్తున్న నాయకులు


కోవూరులో..

కోవూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట కౌలు రైతుల సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువులకు, పురుగు మందులకు సంబంధించిన సబ్సిడీలపై కోత విధిస్తున్నారన్నారు. టీడీపీ కూటమి ఎన్నికల సమయంలో ఎన్నో హామీలిచ్చిందని, అధికారంలోకి వచ్చాక రైతులను పట్టించుకోవడం లేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూ యజమానితో సంబంధం లేకుండా ప్రభుత్వమే గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి గండవరపు శేషయ్య, శ్రీకాంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

- **మనుబోలు:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం నాయకుడు కటికాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో నేతలు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, టీడీపీలు ఎన్నికలకు ముందు ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాయన్నారు. ఇప్పుడు అన్నదాతలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులకు రూ.20 వేల ఆర్థిక సాయం ఊసే ఎత్తడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదిశేషయ్య, దేవదానం తదితరులు పాల్గొన్నారు.

- **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల గురునాథం మాట్లాడుతూ రైతులకు, కౌలు రైతులకు వెంటనే రూ.20,000లను ఇవ్వాలన్నారు. కౌలు రైతుల గుర్తింపు కార్డులు యజమానులు సంతకంతో ప్రమేయం లేకుండా ప్రభుత్వమే జారీ చేయాలన్నారు. సాగుదారులను గుర్తించి వారి పేర్లను ఈ క్రాప్‌లో నమోదు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోకపోతే పోరాటం చేస్తామని తెలిపారు. సోమశిల ఆప్రాన్ పనులు త్వరగా పూర్తి చేయాలని వివరించారు. సీఐటీయూ మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జునరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి పి.మల్లికార్జున, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు తంబి రమణయ్య, ప్రజా సంఘాల నాయకులు పోతంశెట్టి శ్రీనివాసులు, షేక్ జానీబాషా, నన్నం మాధవయ్య, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.


బుచ్చిరెడ్డిపాళెం: నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

పౌష్టికాహారం పంపిణీ

పొదలకూరు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రతినెలా 9వ తేదీన పీఎం సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమం కింద పౌష్టికాహారం అందిస్తున్నారు. సోమవారం భారతి హోం కేర్ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేసినట్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో హోం కేర్ ఎండీ జి.పవన్‌కుమార్, గోపీకృష్ణ, చంద్రశేఖర్, నాగరాజు, మణి, భారతి, సీహెచ్‌సీ కమిటీ మెంబర్స్ ఆర్.సుధీర్, జి.శ్రీనివాసులు, కె.మస్తానమ్మ, వైద్యాధికారులు మల్లికార్జున్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, శిరీష, శాస్త్రి, అనూరాధ పాల్గొన్నారు.



వెంకయ్యస్వామి ఆరాధనోత్సవం

పొదలకూరు: మండలంలోని డేగపూడి గ్రామ సమీపంలో వెంకయ్యస్వామి ఆశ్రమ ఆరాధనోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. వందలాది మంది భక్తులు ఆశ్రమానికి విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మారు వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోడూరు తీరంలో సందడి


సాగర తీరంలో భక్తులు


చర్చిలో వేళాంగణిమాతను దర్శించుకుంటూ..

తోటపల్లిగూడూరు: కోడూరు సాగర తీరంలో సోమవారం వేళాంగణిమాత భక్తులు సందడి చేశారు. వేళాంగణిమాత (మరియమాత) జన్మదిన ఆరాధనోత్సవాలు ముగిశాయి. ఆదివారం రాత్రి ఆలయంలో రాత్రి జాగరణ చేసిన వేలాది మంది భక్తులు సోమవారం తెల్లవారుజామున కోడూరు తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం వేళాంగణిమాతను దర్శించుకున్నారు.

డీకేడబ్ల్యూలో భరతేందు హరిశ్చంద్ర జయంతి

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో హిందీ పితామహుడు బాబు భరతేందు హరిశ్చంద్ర 175 జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అద్దంకి కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ ఎంవీ సత్యనారాయణ భరతేందు హరిశ్చంద్ర జీవితం, సాహిత్య సేవలను వివరించారు. అనంతరం ఎంవీ సత్యనారాయణను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రమణారావు, హిందీ విభాగాధిపతి డాక్టర్ సురేంద్ర, తెలుగు విభాగం ప్రొఫెసర్ కేవీ సత్యనారాయణ, ఉర్దూ ప్రొఫెసర్ మహబూబ్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పౌష్టికాహార మాసోత్సవాలు

తోటపల్లిగూడూరు: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా సోమవారం చిన్నచెరుకూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పేడూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులు పలువురు గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు భవానీ, అనూరాధ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్య పరిరక్షణ

కొడవలూరు: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల సూచించారు. మండలంలోని గుండాలమ్మపాళెం-2 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార విలువలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా గుడ్డు, పాలు, ఆకు కూరలు, చిరు ధాన్యాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్.హైమావతి, బి.సంపూర్ణ, కె.శ్రావణి, కె.మమత, సీహెచ్.రేణుక పాల్గొన్నారు.


చిన్నచెరుకూరు అంగన్‌వాడీ కేంద్రంలో..

బిడ్డకు ముర్రుపాలే శ్రీరామరక్ష

విడవలూరు : పుట్టిన బిడ్డకు అందించే ముర్రుపాలు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ బి.రమణి అన్నారు. మండలంలోని ఊటుకూరు పెద్దపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలు ఉండే ఆహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు ఆరోగ్యవంతంగా ఉంటారని తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి, కామాక్షమ్మ, సీతా కల్యాణి, తిరుపతమ్మ, ఏఎన్‌ఎంలు కల్పన, నవీన, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


విడవలూరు: ఊటుకూరు పెద్దపాళెంలో..


కొడవలూరు: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నిర్మల

గణనాథుడికి జేజేలు


విడవలూరు: రామతీర్థం తీరంలో..


కొడవలూరు: గండవరంలో..


మనుబోలు: పూజలందుకుంటున్న బొజ్జ గణపయ్య


ముత్తుకూరు: విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

- **ఘనంగా ఉట్టి మహోత్సవాలు**

పొదలకూరు: వినాయక చవితి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పద్మావతినగర్, రామమందిరం వీధి, యాదవవీధి, తొగటివీధి సెంటర్లలో యువకులు ఉట్టి కొట్టారు. అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. కొందరు విగ్రహాలను సంగం పెన్నానది, కండ్లేరు ఏటికాలువ తదితర ప్రాంతాలకు తరలించి నిమజ్జనం చేశారు. మరికొన్ని ప్రాంతాల వారు ఐదోరోజున నిమజ్జనోత్సవాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు.

కోలాహలంగా..

ముత్తుకూరు: వినాయక చవితి పండగ సందర్భంగా ప్రతిష్ఠించిన విగ్రహాలను సోమవారం నిమజ్జనానికి సముద్రం వద్దకు తరలించారు. ముత్తుకూరు, బ్రహ్మదేవి, కృష్ణపట్నం, పంటపాళెం, వల్లూరు తదితర పంచాయతీల నుంచి వాహనాల్లో కృష్ణపట్నం తీరానికి తరలించి నిమజ్జనం చేశారు. ఈ సంబరాల్లో యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వాడవాడలా..

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలులో వివిధ కూడళ్లలో సుమారు 25 విగ్రహాలను ఏర్పాటు చేశారు. సోమవారం అనేకచోట్ల గ్రామోత్సవాలు నిర్వహించి కమాల్ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు. మనుబోలులోని పిడూరురోడ్డులో ఉన్న వినాయక మండపం వద్ద అర్చకుడు శ్రీనివాసులు మహా గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అన్నదానం చేశారు. ఉభయకర్తలుగా ఆడిపూడి రామకృష్ణారెడ్డి - భువనేశ్వరి దంపతులు, కుటుంబసభ్యులు వ్యవహరించారు. అలాగే జట్ల కొండూరు పంచాయతి జ్యోతి నగర్‌లో ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం అన్నప్రసాద వితరణ చేశారు.

పటిష్ట బందోబస్తు మధ్య నిమజ్జనం

విడవలూరు: మండలంలోని రామతీర్థం బీచ్‌లో పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య సోమవారం గణేశ్ నిమజ్జనం జరిగింది. కొడవలూరు, విడవలూరు మండల పరిధిలో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలు ఎక్కువగా రామతీర్థం బీచ్‌లో నిమజ్జనం చేస్తుంటారు. ఈ క్రమంలో సీఐ సురేంద్రబాబు, ఎస్సై సాయిప్రసాద్, మెరైన్ ఎస్సై రసూల్ వారి సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

మైపాడుకు తరలివస్తున్న గణనాథులు

ఇందుకూరుపేట : నిమజ్జన కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి గణనాథుల విగ్రహాలు సోమవాం మైపాడు తీరానికి చేరుకున్నాయి. భక్తులు కేరింతలు కొడుతూ, ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొంటూ గణేశ్ విగ్రహాలను ఉత్సాహంగా సాగర ఒడికి చేరుస్తున్నారు. దీంతో మైపాడు-నెల్లూరు రోడ్డు సందడిగా మారింది. ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

వేడుకగా ఉత్సవాలు

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెం, గండవరం, కొడవలూరులో వినాయక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. నార్తురాజుపాళెం దళితవాడలో వినాయక ప్రతిమకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సర్పంచ్ బి.సుప్రియ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

- మండలంలోని గండవరం రావిచెట్టు సెంటర్‌లో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు ఆలంమాలకొండయ్య, పెనాక వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కొడవలూరు: నార్తురాజుపాళెంలో అన్నదానం


ఇందుకూరుపేట: మైపాడు తీరం చేరుకుంటున్న వినాయక విగ్రహం


మనుబోలు: మహాగణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం


ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టులో..


మనుబోలు: జ్యోతినగర్‌లో అన్నదానం


పొదలకూరు: ఉట్టి కొడుతూ..


పొదలకూరు: విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తూ..